## జేఎన్టీయూ వైస్‌చాన్స్‌లర్‌గా టీకేకే రెడ్డి

- ఉత్తర్వులు జారీచేసిన సర్కారు
- బాధ్యతలు స్వీకరించిన కొత్త వీసీ



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయం(జేఎన్టీయూ) వైస్‌చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ తడిసిన కిషన్‌కుమార్‌రెడ్డి(టీకేకేరెడ్డి) నియమితులయ్యారు. ప్రభుత్వం జీవో జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వులందుకున్న ఆయన మంగళవారమే జేఎన్టీయూకు చేరుకుని ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. మూడేండ్లపాటు ఆయన వీసీగా కొనసాగుతారు. వాస్తవానికి నిరుడు మే 21న వీసీ పోస్టు ఖాళీ అయ్యింది. తొలుత బుర్రా వెకంటేశంకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలప్పగించారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి ఇన్‌చార్జీ వీసీ బాధ్యతలప్పగించారు. మళ్లీ రెండోసారి సెర్చ్ సమావేశాన్ని నిర్వహించగా, సెర్చ్ కమిటీ సిఫారసుల మేరకు గవర్నర్ టీకేకే రెడ్డిని నూతన వీసీగా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీచేసింది. అయితే వీసీ ఎంపిక ప్రక్రియ గతంలోనే జరగగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో నియామకానికి అడ్డంకి ఎదురయ్యింది. దీంతో వీసీ నియామకం కాస్త అలస్యమయ్యింది. విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యాప్రమాణాల పెంపునకు కృషిచేస్తా అని తడిసిన కిషన్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## సమస్యలకు నిలయాలుగా వర్సిటీలు

- వసతుల కల్పనకు 5 వేల కోట్లు కేటాయించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. వర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, వాటి అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ల్యాబ్ పరికరాలు, హాస్టల్స్, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాలు లేవని, భవనాల పెచ్చులు ఊడి విద్యార్థులు గాయపడుతున్నారని ఆరోపించారు. ఓయూ న్యాక్ గుర్తింపులో వెనుకబడి ఉందని, యూనివర్సిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, వసతులు కల్పించాలని కోరారు. పీహెచ్‌డీ విద్యార్థులకు నెలకు రూ.25 వేలు ఫెలోషిప్ అందించాలని, అన్ని యూనివర్సిటీలకు రీసెర్చ్ గ్రాంట్స్ అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల వేతనాలు పెంచాలని, విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# విద్యకు 10-12% నిధులివ్వండి

- రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయిస్తేనే పురోగతి
- సర్కారు జోక్యం చేసుకోవాలి: విద్యాకమిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10-12శాతం నిధులు కేటాయించాలని తెలంగాణ విద్యాకమిషన్ సిఫారసు చేసింది. నిరుడు బడ్జెట్‌లో 7.4శాతం మాత్రమే కేటాయించారని, ఈ సారి గణనీయంగా పెంచాలని, విద్యకు కేటాయింపులు పెంచితేనే పురోగతి సాధ్యమని తేల్చిచెపింది. విద్యారంగంలో అభ్యాస పేదరికం (లర్నింగ్ పావర్టీ) ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేసింది. 2025- 26 బడ్జెట్‌లో విద్యారంగ బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేసింది. మంగళవారం తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, చారగొండ వెంకటేశ్, జ్యోత్స్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి ఓ నివేదిక అందజేశారు. ప్రభుత్వ రంగంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు, యూనివర్సిటీలవారీగా కేటాయించాల్సిన బడ్జెట్‌ను తయారుచేసి సమర్పించారు. రాష్ట్రంలో సర్కారు యాజమాన్యంలో ప్రీ ప్రైమరీ విద్యనందించేందుకు కొత్తగా ఫౌండేషన్ స్కూల్స్‌ను



ఏర్పాటుచేయాలని విద్యాకమిషన్ కోరింది. పాఠశాలలు, ఫౌండేషనల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు నిధులు కేటాయించాలని ఆయా నివేదికలో పేర్కొంది.

## పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 18(నమస్తే తెలంగాణ) : ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. 21-24 ఏండ్ల వయసు ఉండి, పది, 12తరగతులు, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ తదితర విద్యార్హతలు, 8లక్షలలోపు ఆదాయం ఉన్నవారు దరఖాస్తుకు అర్హులు. ఆసక్తి ఉన్నవారు pminternship.mca.gov.in పోర్టల్ ద్వారా మార్చి 11వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.




















